నూతన సంవత్సర వేడుకలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి

కామారెడ్డి/మాచారెడ్డి, డిసెంబర్ 30 : నూతన సంవత్సర వేడుకలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, మాచారెడ్డి ఎస్సై అనీల్ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మద్యం తాగి అతివేగంగా వాహనాలు నడిపే వారు, త్రిబుల్ రైడింగ్, కేరింతలు కొడుతూ అశాంతి వాతావరణం కలిగించే వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లపై కేకులు కట్ చేసినా, డీజేలు పెట్టి డ్యాన్సులు చేసినా, మద్యాన్ని బహిరంగంగా తాగుతూ కనిపించినా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాత్రి 12 గంటల తర్వాత వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని తెలిపారు. పోలీసు బృందాలతో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు పాటించాలని కోరారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కామారెడ్డి, డిసెంబర్ 30 : జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్ కుమార్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటం చేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాహుల్, నితిన్, సమీర్, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రికార్డు అసిస్టెంట్ మృతి

మాచారెడ్డి, డిసెంబర్ 30 : మాచారెడ్డి తహసీల్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న నాయిని నవీన్(31)కు ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. నిజామాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వివరాల ఇలా ఉన్నాయి. రెడ్డిపేట గ్రామానికి చెందిన నవీన్ ఆదివారం సాయంత్రం రెడ్డిపేట నుంచి కామారెడ్డి వెళ్తున్నాడు. పాల్వంచ మండలంలోని ఆరెపల్లి స్టేజీవద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. కామారెడ్డి ఏరియా దవాఖానకు తరలించగా మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నట్లు తెలిపారు.

అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనం పట్టివేత

భిక్కనూరు, డిసెంబర్ 30 : భిక్కనూరు జాతీయ రహదారిపై గోవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఏఎస్సై జగదీశ్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గోవులను డీసీఎంలో తరలిస్తున్నారన్న సమాచారంతో భిక్కనూరు టోల్ ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టామన్నారు. తనిఖీలను గమనించిన దుండగులు టోల్ ప్లాజా నుంచి తప్పించుకొని పారిపోతుండగా ఆ వాహనాన్ని పోలీసులు వెంబడించారు. బస్వాపూర్ శివారులో జాతీయ రహదారి పక్కన లారీ నిలిపి డ్రైవర్, క్లీనర్ పారిపోయారు. ఆ వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న నిరసన

సీఎం హామీ గ్యారంటీ చిత్రంతో సెల్ఫీ దిగుతూ నిరసన తెలియజేస్తున్న సర్వశిక్ష ఉద్యోగులు

కామారెడ్డి, డిసెంబర్ 30 : సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె సోమవారానికి 21 వ రోజు చేరింది. జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఎం హామీ ఫ్లెక్సీతో సెల్ఫీ దిగుతూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీని నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు రాములు, సంతోష్ రెడ్డి, శైలజ, కాళిదాసు, వీణ, సాయిలు, లావణ్య, సమగ్రశిక్ష ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం..

- సమయ పాలన పాటించని అధికారులు, సిబ్బంది
- 'ప్రజావాణి'కి హాజరుకాని పలు శాఖల అధికారులు

దోమకొండ రెవెన్యూ కార్యాలయంలో ఖాళీగా ఉన్న తహసీల్దార్ కుర్చీ

బీబీపేట్(దోమకొండ), డిసెంబర్ 30 : దోమకొండలోని తహసీల్ కార్యాలయానికి ఉదయం 10:40 గంటలైనా తహసీల్దార్ చేరుకోలేదు. తహసీల్దార్‌తోపాటు ఇటీవల వీఆర్ఏ నుంచి వచ్చిన జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ సిబ్బంది సమయపాలన పాటించకుండా.. అంతా మా ఇష్టం అన్నట్లుగా కార్యాలయానికి వచ్చీ.. వెళ్తుండడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు గురువుతున్నారు. భూముల రిజిస్ట్రేషన్ కోసం మండలంలోని ఆయా గ్రామాల నుంచి వచ్చిన రైతులు తమ స్లాట్ బుకింగ్ 10 గంటలకు ఉండగా వారి రిజిస్ట్రేషన్ గంటల కొద్దీ సమయం పగడుతున్నదని వాపోతున్నారు. తహసీల్దార్ సమయపాలన పటించకపోవడంతో కార్యాలయ సిబ్బంది కూడా సమయానికి రావడం లేదు. తహసీల్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి కూడా పలు శాఖల అధికారులు హాజరుకాలేదు. మరి కొంతమంది రెవెన్యూ ఉద్యోగులు ఉదయం 10 గంటలకు వచ్చి పనులు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు అందుబాటులో ఉండి సమయపాలన పటించేలా అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి వెళ్లిన నాయకులు

నస్రుల్లాబాద్ నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

నస్రుల్లాబాద్, డిసెంబర్ 30 : నస్రుల్లాబాద్ మండలంలోని నాచుపల్లి, నస్రుల్లాబాద్ తదితర గ్రామాల నుంచి నిజామాబాద్‌లో ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు తరలి వెళ్లారు. బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, నాయకులు నర్సింహులు గౌడ్, అఫ్రోజ్, సాయిలు, సాయి, శేఖర్, భాస్కర్ తదితరులు తరలివెళ్లారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

రాజంపేట్, డిసెంబర్ 30 : అప్పుల బాధతో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజంపేట మం డలం ఆరెపల్లి గ్రామానికి చెందిన కొమ్ము నర్సింహులు (33) అప్పుల బాధ భరించలేక సోమవారం ఉరేసుకున్నాడన్నారు. భార్య కొమ్ము సుమలత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కూతురు దేవునిపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుకుంటున్నది. క్రిస్మస్ సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చింది. కూతురును తిరిగి పాఠశాలకు పంపడానికి సోమవారం భార్య వెళ్లింది. మధ్యా హ్నం 2.30 గంటలకు ఇంటికి వచ్చేసరికి బెడ్‌రూంలో ఉరేసుకున్నాడు. చుట్టుపక్కలవారి సహాయం తో కిందికి దింపి దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికె మృతి చెందినట్లు డాక్టర్ చెప్పారు. అప్పులు ఎక్కువయ్యాయని, ఎలా తీర్చాలంటూ తరచూ బాధపడుతుండేవాడని, దీంతో మనస్థాపం చెంది ఉరేసుకున్నాడని, తన భర్త మరణంపై ఎవ్వరిపై ఎలాంటి అనుమానాలు లేవని, భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

ఆకు కూరలను పరిశీలిస్తున్న ఎంఈవో

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 30 : బాన్సువాడ మండలం కొత్తాబాది గ్రామంలోని కస్తూర్బా పాఠశాలను మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండిపెట్టిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు సరఫరా చేస్తున్న ఆకు కూరలు, పప్పుదినుసులు, కిరాణా వస్తువులను ఆయన పరిశీలించారు. నాణ్యమైన కూరగాయలను మాత్రమే తీసుకోవాలని వార్డెన్‌కు సూచించారు. ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచిన నేపథ్యంలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించాలని సూచించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు.

విద్యార్థులకు షీ టీం, సైబర్ క్రైంపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నస్రుల్లాబాద్, డిసెంబర్ 30 : బీర్కూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కామారెడ్డి పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో షీ టీం, సైబర్ క్రైం, రోడ్డు సేఫ్టీ, బాల్య వివాహాలపై సోమవారం అవగాహన కల్పించారు. షీ టీం నంబర్ 8712686094, సైబర్ నేరాల కోసం 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఇన్‌చార్జి హెచ్ఎం శివరాం, పోలీసు కళాబృందం సభ్యులు ప్రభాకర్, శేషారావు, సాయిలు, బీర్కూర్ పోలీసు సిబ్బంది శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రికి సన్మానం

పద్మావతిని సన్మానిస్తున్న మహాసభ ప్రతినిధులు

మాచారెడ్డి, డిసెంబర్ 30 : ఈ నెల 28, 29వ తేదీల్లో విజయవాడ కేబీఎన్ కళాశాలలో నిర్వహించిన ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన కవయిత్రి కందాళ పద్మావతిని తొలిరోజు సత్కరించారు. రెండో వేదికైన అద్దేపల్లి రాంమోహనరావు వేదికపై నిర్వహించిన పర్యావరణం అనే అంశంపై ప్రకృతి గొంతుకనై అనే కవిత శీర్షికతో పర్యావరణంపై తమవంతు బాధ్యతను గుర్తు చేస్తూ కవిత చెప్పినందుకుగాను ప్రశంసాపత్రం శాలువాతో సత్కరించారు.

సర్వేను వేగవంతం చేయాలి

రాజంపేట్, డిసెంబర్ 30 : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించినట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారని తహసీల్దార్ తెలిపారు.

ఎల్లారెడ్డిలో సాంఘికశాస్త్ర టాలెంట్ టెస్ట్

ఎల్లారెడ్డి జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో సాంఘికశాస్త్రం టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 30: పట్టణంలోని జడ్పీహెచ్ బాలికల పాఠశాలలో సోమవారం మండలస్థాయి సాంఘికశాస్త్ర టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షలకు మండలంలోని తొమ్మిది పాఠశాలల నుంచి 17మంది తెలుగు మీడియం విద్యార్థులు, 15 మంది ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు హాజరయ్యారు. తెలుగు మీడియంలో ఎల్లారెడ్డి జడ్పీహెచ్ఎస్ బాలికల విద్యార్థిని మహేశ్వరి, అడ్విలింగాల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని నాగలక్ష్మి ప్రథమ స్థానం, ఎల్లారెడ్డి జడ్పీహెచ్ఎస్ బాలికల విద్యార్థినులు శరణ్య, వైష్ణవి ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. ఇంగ్లిష్ మీడియంలో ఎల్లారెడ్డి టీజీఎంఎస్ విద్యార్థినులు పావని, అంజలి ప్రథమ, ద్వితీయ స్థానాలు, ఎల్లారెడ్డి కేజీబీవీ విద్యార్థిని శరణ్య తృతీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజనేయులు, గణపతి, మురళి, విఠల్, రాజశేఖర్, విజయశ్రీ, సోహరాణి, శారద, సుజాత, సావిత్రీదేవి తదితరులున్నారు.

నిజాంసాగర్‌లో సోషల్ ట్యాలెంట్ టెస్ట్..

నిజాంసాగర్, డిసెంబర్ 30 : నిజాంసాగర్‌లో మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ సోమవారం నిర్వహించారు. ఈ టెస్ట్‌లో తెలుగు మీడియం నుంచి వి. అంజన సౌమ్య (జడ్పీహెచ్ఎస్–మల్లూర్)మొదటి స్థానం, బి. భానుప్రియ (జీహెచ్ఎస్–నిజాంసాగర్) ద్వితీయ స్థానం, బి. దీపక్(జడ్పీహెచ్ఎస్–అచ్చంపేట్) తృతీయ స్థానం సాధించారు. ఇంగ్లిష్ మీడియంలో ఎమ్.గజానంద్ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్–అచ్చంపేట్) ప్రథమస్థానం, కె. హరిప్రియ (టీజీఎమ్ఎస్–అచ్చంపేట్) ద్వితీయ స్థానం, జి. శివరాం (టీజీఎమ్ఎస్–అచ్చంపేట్), పి. నితీష (కేజీబీవీ–నిజాంసాగర్) తృతీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో నిజాంసాగర్ ఎంఈవో వై.తిరుపతిరెడ్డి, మహ్మద్‌నగర్ ఎంఈవో ఎల్. అమర్ సింగ్, జీహెచ్ఎస్ హెచ్ఎం ఎన్. రాంచందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★ I, GOSAM MIRIYALA SRINIVAS (Old Name) R/o. H.No.1-65/4, Badguna (Vill), Nandipet (Mdl), Dist. Nizamabad Changed My Name as MIRIYALA SRINIVAS (new Name) S/o. MIRIYALA PEDDA SAILU
NTZ-338275

WANTED
★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338992-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

భక్తిశ్రద్ధలతో సోమవతి అమావాస్య

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 30: ఎల్లారెడ్డి పట్టణంలో సోమవారం సోమవతి అమావాస్య ప్రత్యేకపూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని సాయిబాబా ఆలయం, తిమ్మారెడ్డి శివారులో ఉన్న కొత్త హనుమాన్ ఆలయాల్లో సోమవారం భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేకపూజలు చేపట్టారు. మొదటగా శివునికి పూజలు, అభిషేకాలు చేసిన పిదప, రాగిచెట్టుకు ప్రత్యేకపూజలు చేసారు.

ఘనంగా ఎలామాస్య పండుగ..

మద్నూర్, డిసెంబర్ 30: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎలామాస్య పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తమ పంట చేనులో లక్ష్మీదేవి, భూదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం తమ బంధుమిత్రులను పిలిపించుకొని సహపంక్తి భోజనాలు చేశారు

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 30: పిట్లం మండలంలోని ధర్మారం గ్రామంలో ఎలమాస పండగను రైతులు ఘనంగా నిర్వహించారు. రైతులు ఉదయాన్నే పంట చెనుల్లోకి వెళ్ళి జొన్న,శెనగ పంటలో రైతులు,మహిళలు భక్తిశ్రద్దలతో లక్ష్మీదేవికి పూజించి,భూమాతకు పాలు పొంగించి,పిండి వంటలతో నైవేద్యం సమర్పిస్తారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్, డిసెంబర్ 30 : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఎలామాస పండగను రైతులు ఘనంగా నిర్వహించారు.

వేడుకలకు ముందస్తు అనుమతి తప్పనిసరి


మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 30: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నా ఎక్సైజ్‌శాఖ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఎక్సైజ్ సీఐ షాకీర్ సోమవారం సూచించారు. ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, కామారెడ్డి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంత్‌రావు ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నూతన సంవత్సర వేడుకలు ఫంక్షన్‌హాల్‌లో గాని, బహిరంగ ప్రదేశాల్లో గాని నిర్వహించే ఈవెంట్స్ కోసం అనుమతి తీసుకోవడం తప్పనిసరి అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో అనుమతులు లేకుండా మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డీజేలను వినియోగిస్తే ఉపేక్షించేది లేదు : ఎస్సై

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 30: నూతన సంవత్సర వేడుకల్లో ఎటువంటి డీజేలు వాడినా, అధికశబ్దం వచ్చే బాక్స్‌లను వినియోగించినా ఉపేక్షించేది లేదని ఎస్సై బొజ్జ మహేశ్ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 31న విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను మండలవ్యాప్తంగా చేపడుతామన్నారు. ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, ఇష్టానుసారంగా, అతివేగంగా వాహనాలు నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో వేడుకలు జరుపుకోవాలని ఆయన సూచించారు.

అక్రమ నిర్మాణం ఆపాలని నోటీసులు

అక్రమంగా నిర్మిస్తున్న ఇంటికి నోటీసు అంటిస్తున్న పంచాయతీ సిబ్బంది

లింగంపేట, డిసెంబర్ 30: మండల కేంద్రంలో పంచాయతీ అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం చేపడుతున్న ఇంటి యజమాని రాజారాం సంజీవులుకు గ్రామ కార్యదర్శి శ్రావణ్ నోటీసులు జారీ చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి యజమాని పంచాయతీ నుంచి అనుమతులు లేకుండా గృహనిర్మాణం చేపట్టడంతో పాటు అదనంగా స్థలాన్ని ఆక్రమించి ఇంటిని నిర్మిస్తున్నాడన్నారు. అదనపు నిర్మాణాన్ని రెం డు రోజుల్లో తొలగించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యల కోసం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, అలాగే అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తామని నోటీసులో పేర్కొన్నారు.

అఖిల పక్షం ఆధ్వర్యంలో ధర్నా

లింగంపేటలో రాస్తారోకో నిర్వహిస్తున్న అఖిల పక్షం నాయకులు

లింగంపేట, డిసెంబర్ 30: లింగంపేట పంచాయతీకి కేటాయించిన భూములను కాపాడాలని అఖిల పక్షం ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. పంచాయతీ భూముల ఆక్రమణకు నిరసనగా మండల కేంద్రంలోని దుకాణా సముదాయాలు స్వచ్ఛందంగా బంద్ పాటించి కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద 1074 సర్వే నంబర్‌లో ఆరు వందల గజాల స్థలాన్ని 167/1989 లేఅవుట్‌లో పంచాయతీకి కేటాయించినట్లు తెలిపారు. ఈ భూమి విలువ సుమారు కోటి రూపాయల వరకు ఉంటుందన్నారు. 2001లో అప్పటి జిల్లా పంచాయతీ అధికారి రామకృష్ణ స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కబ్జాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో నరేశ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీకి కేటాయించిన భూమిని సర్వే చేసి ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. అఖిల పక్షం నాయకులు నారాగౌడ్, సంగయ్య, గోపిగౌడ్, మారుతి, రవి, నారాయణ, రాములు, భైరయ్య, లక్ష్మీనారాయణ, శివయ్య, వాహబ్, ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి రెండు ఫిర్యాదులు

ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 30: ఎల్లారెడ్డి పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో జిల్లా కేంద్రం నుంచి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు వచ్చినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ చరణ్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన రెండు ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, మున్సిపల్ ఏఈ వినోద్, మత్తమాల హెల్త్ సూపర్‌వైజర్ రాజేశ్వరి తదితరులున్నారు

'ప్రజావాణి'కి ఫిర్యాదు..

లింగంపేట, డిసెంబర్30: తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఒక ఫిర్యాదు వచ్చినట్లు తహసీల్దార్ నరేందర్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో పంచాయతీకి అందించిన భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆక్రమణకు గురైన పంచాయతీ భూములు కాపాడాలని కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్, ఏపీఎం శ్రీనివాస్, ఎంపీవో మల్లారీ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత

మద్నూర్, డిసెంబర్ 30: మండలంలోని మెనూర్ గ్రామం నుంచి మోఘ వెళ్లే దారిలో సోమవారం 48 సీసాల దేశీదారు పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మోఘ గ్రామానికి చెందిన నాగేశ్ తన బైక్‌పై మహారాష్ట్రకు చెందిన అక్రమ దేశీదారు తీసుకురాగా తనిఖీ చేసి పట్టుకున్నామన్నారు. వాహనాన్ని సీజ్‌చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. ఎస్సై నాగేశ్, పరశురాం, శ్రీకాంత్ ఉన్నారు.

జడ్పీటీసీ మాజీ సభ్యుడికి పరామర్శ

గాంధారి మాజీ జడ్పీటీసీ సభ్యుడు తానాజీరావు మాతృమూర్తి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

గాంధారి, డిసెంబర్ 30: గాంధారి జడ్పీటీసీ మాజీ సభ్యుడు తానాజీరావు మాతృమూర్తి రత్నబాయి ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సోమవారం మండల కేంద్రంలోని జడ్పీటీసీ మాజీ సభ్యుడి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా రత్నాబాయి చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. ఆయన వెంట కామారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

వెల్లుట్ల జడ్పీహెచ్ఎస్‌లో నిరసన

పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ బృందం

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 30: హైదరాబాద్‌లో తుక్కుగూడ ప్రధానోపాధ్యాయుడిపై జరిగిన దాడికి నిరసనగా మండలంలోని వెల్లుట్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాపూరావు, శ్రీనివాస్‌రావు, విఠల్, భార్గవి, నిశాంత్‌కుమార్ తదితరులున్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించండి

ఎల్లారెడ్డిలో విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్న అధికారులు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 30: పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులు చెల్లించి, విద్యుత్‌శాఖకు సహకరించాలని ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఏఈ వెంకటస్వామి కోరారు. సోమవారం పట్టణంలో పెండింగ్‌లో ఉన్న వ్యాపార సముదాయాల బిల్లులను విద్యుత్ సిబ్బందితో కలిసి ఆయన వసూలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చేపట్టిన స్పెషల్‌డ్రైవ్‌లో లక్షా యాభైవేల రూపాయల పెండింగ్ బిల్లులు వసూలు చేశారు. పట్టణంలోని ప్రతి వ్యాపారి బిల్లులు పెండింగ్‌లో ఉంచకుండా చెల్లించాలని ఆయన కోరారు. ఆయనతో పాటు లైన్ ఇన్‌స్పెక్టర్లు జగదీశ్, విఠల్‌రావు, ఎల్ఎండీ గౌస్ తదితరులున్నారు.